News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :157 | ఖమ్మం | మంగళవారం, జూలై 22, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# అన్ని మండల కేంద్రాల్లో రేషన్‌కార్డుల పంపిణీ

- రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన!
- రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ, ఆందోళన వద్దన్న ముఖ్యమంత్రి
- ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్ కార్డుల పంపిణీ
- ఇప్పటి వరకు 7 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడి



## కలెక్టర్లు కదలాలి

- క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి
- వారి పనితీరుపై రోజువారీగా సీఎస్, సీఎంవో నివేదికలివ్వాలి
- అజాగ్రత్తగా ఉంటే ఎవరినైనా ఉపేక్షించేది లేదు
- రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు
- 25 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- ప్రతి కలెక్టర్ ఖాతాలో రూ.కోటి అత్యవసర నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జిల్లాల పరిధిలోని ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రోజూ కలెక్టర్లు ఏ పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వారి కార్యాచరణ రిపోర్టు రోజూ తనకు పంపించాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.
"రాష్ట్రంలో సరిపడినంత ఎరువులు ఉన్నాయి. ఆందోళన అవసరం లేదు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో బయట నోటీస్ బోర్డు పెట్టాలి. రాయితీ ఎరువులను ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.కోటి కేటాయించాలి.
ఇప్పటి వరకు 7లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు ఇచ్చాం. ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్‌కార్డుల పంపిణీ చేయాలి. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలి. అన్ని మండల కేంద్రాల్లో పంపిణీ జరగాలి. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ.. ఆందోళన అవసరం లేదు" అని సీఎం అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

వివరాలు 2లో..

## ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్..



- తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన జగదీప్ ధన్‌ఖడ్
- ఆరోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి
- తక్షణమే అమల్లోకి రాజీనామా

వివరాలు 2లో..

## నాకు హోమం జరిపించండి... ఏ ఆటంకం రాకుండా చూసుకుంటా



తనకు ధనవంతరి హోమం జరిపించాలన్నారు మాతంగి స్వర్ణలత. మీర్ ఆలం మండి మహంకాళి ఆలయంలో రంగం భవిష్యవాణి కార్యక్రమం వినిపించారు. భవిష్యవాణి కార్యక్రమం చూడడానికి భారీగా తరలి వచ్చారు జనం. ఈ సందర్భంగా భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత. మీరు చేసిన పూజలతో సంతోషంగా ఉన్నా. ప్రజలందరిని ఏ ఆటంకం కలగకుండా చూసుకొంటా. బాల బాలికలకు ఏ ఆపద రాకుండా చూసుకుంటా. రాబోయే రోజుల్లో కోరినన్ని వర్షాలు పడతాయి. మహమ్మారితో జాగ్రత్తగా ఉండడండి. నాకు ధనవంతరి హోమం జరిపించాలి.

వివరాలు 2లో..

## నా గుండె కొట్టుకునేది మీ కోసమే

### 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో పవన్ కల్యాణ్

- హైదరాబాదులో హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్
- ఎమోషనల్ స్పీచ్ ఇచ్చిన పవన్ కల్యాణ్
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి థ్యాంక్స్ చెప్పిన పవన్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన పాన్-ఇండియా చిత్రం 'హరి హర వీరమల్లు' ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ తన సినీ ప్రస్థానం, చిత్రం గురించి హృదయస్పర్శిగా మాట్లాడారు. ఈ చిత్రం జులై 24న విడుదల కానుంది. పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో, ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు అనుమతి ఇచ్చిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. పోలీసులకు కూడా ధన్యవాదాలు తెలుపుతున్నానని వెల్లడించారు. "సినిమా రంగం నాకు అన్నీ ఇచ్చింది. సమాజంలో ఎన్ని తేడాలు ఉన్నా, సినిమా అందరినీ ఒక్కటి చేస్తుంది. ఈ చిత్రం కోసం చాలా సవాళ్లను ఎదుర్కొన్నాం. రెండు కోవిడ్ వేవ్‌లు, ఆర్థిక సమస్యలు, సృజనాత్మక ఒడిదొడుకులు వచ్చాయి. నా రాజకీయ బాధ్యతల కారణంగా కొంత సమయం ఇవ్వలేకపోయాను. అయినా, నిర్మాత ఏ.ఎం. రత్నం గారి నమ్మకం, ఆయన నిబద్ధత నన్ను ఈ ప్రాజెక్ట్‌లో ఉంచాయి" అని చెప్పారు.ఈ చిత్రం గురించి మాట్లాడుతూ, "17వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్య నేపథ్యంలో ఈ చిత్రం ఒక కల్పిత యోధుడి కథ. నేను చేసిన ఒక 20 నిమిషాల యాక్షన్ సన్నివేశం కథను

వివరాలు 2లో..

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం...

### 'జీరో ఫేర్ టిక్కెట్లపై సీఎం చంద్రబాబు ఆదేశం



- గత ఎన్నికల వేళ హామీ ఇచ్చిన కూటమి
- మహిళలకు వెసులుబాటు కలిగించనున్న పథకం
- సమీక్ష చేపట్టిన సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..



## అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన పేర్ని నాని!

- రప్పా రప్పా కాదు... రాత్రికి రాత్రి చేసేయాలన్న పేర్ని నాని
- రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు
- ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణను రేపటికి వాయిదా వేసిన హైకోర్టు

వివరాలు 2లో..

## జగన్ దురాగతాలను లోక్ సభలో బట్టబయలు చేస్తాం

- లిక్కర్ స్కామ్ పై లోక్ సభలో చర్చిస్తామన్న కృష్ణదేవరాయలు
- మిథున్ రెడ్డిని సిట్ విచారిస్తోందని వ్యాఖ్య
- ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్న ఎంపీ

వివరాలు 2లో..



## దళితబంధు నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- 214 మంది లబ్ధిదారులకు సాయం పంపిణీ



రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇళ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం గాంధీనగర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన సోమవారం భూమిపూజ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం చింతకానిలో 214 మంది లబ్ధిదారులకు రెండో విడత పెండింగ్‌లో

వివరాలు 2లో..

## బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో విచారణకు రండి

### సినీ ప్రముఖులకు ఈడీ నోటీసులు



బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఆయా యాప్‌ల తరఫున ప్రచారం చేసిన పలువురు సినీ ప్రముఖులకు సోమవారం నోటీసులు జారీ చేసింది. వీరిలో దగ్గుబాటి రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మిలు ఉన్నారు. దగ్గుబాటి రానా ఈ నెల 23, ప్రకాశ్‌రాజ్ ఈ నెల 30, విజయ్‌దేవరకొండ ఆగస్టు 6, మంచులక్ష్మి ఆగస్టు 13 తేదీల్లో విచారణ నిమిత్తం తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఇంకా పలువురు సెలెబ్రిటీలు, యూట్యూబర్లకు నోటీసులు జారీ చేసి విచారించనున్నారు. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల కారణంగా అనేకమంది అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో వివిధ పోలీస్ స్టేషన్లలో

వివరాలు 2లో..

### మిథున్ రెడ్డి మాస్టర్ మైండ్ అయితే...

## ప్రధాన లబ్ధిదారుడు జగనే



- ఏపీ లిక్కర్ స్కామ్‌లో మిథున్ రెడ్డి అరెస్ట్
- రూ.3,500 కోట్లు దోచుకున్నారన్న యనమల
- రికవరీ చట్టం అమలు చేయాలని సూచన

వివరాలు 2లో..

## జీవో 49పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం!

- ఆదివాసీలకు శు భవార్త చెప్పిన తెలంగాణ ప్రభుత్వం
- 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' జీవోను నిలుపుదల చేసిన ప్రభుత్వం
- ఆదివాసీల ఆందోళనలు నివృత్తి చేసే వరకు జీవో అమలు నిలిపి ఉంచాలన్న ప్రభుత్వం



వివరాలు 2లో..

# నా గుండె కొట్టుకునేది మీ కోసమే

- **మొదటి పేజి తరువాయి**

మలుపు తిప్పేలా ఉంటుంది. దీనికి ఎం.ఎం. కీరవాణి గారు 10 రోజులు సంగీతం సమకూర్చారు" అని పవన్ వెల్లడించారు.
నిర్మాత ఏ.ఎం. రత్నంపై ప్రశంసలు కురిపిస్తూ, "రత్నం గారు తెలుగు సినిమా నాణ్యతను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఈ చిత్రం కోసం ఆయన చూపిన చిత్తశుద్ధి నన్ను కట్టిపడేసింది. అందుకే ఈ ప్రెస్ మీట్‌కు వచ్చాను" అని పవన్ తెలిపారు.
ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్ ఔరంగజేబ్ పాత్రలో కనిపించనున్నారు. "బాబీ డియోల్ చాలా అద్భుతంగా నటించారు. ఆయనతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది" అని పవన్ పేర్కొన్నారు.
"నేను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓ మంచి మిత్రుడు లభించాడు... ఆయనే కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే. గతంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసు. భీమ్లానాయక్ సినిమా టైమ్ లో అన్ని సినిమాలకు టికెట్లు రూ.100, ఆపైన ఉంటే నా సినిమా టికెట్ ను రూ.10, 15కి అమ్మారు. అలాంటి పరిస్థితుల్లో కూడా మనల్ని ఎవడ్రా ఆపేది అని చెప్పాను. నేనెప్పుడూ రికార్డుల కోసం ప్రయత్నించలేదు. సగటు మనిషిగా బతకడం ఒక్కటే నా కోరిక. నా గుండె మీ (ఫ్యాన్స్) గురించే కొట్టుకుంటుంది.
ఈ సందర్భంగా త్రివిక్రమ్ గురించి చెప్పాలి. చాలామంది మనం బాగున్నప్పుడే దగ్గరకు వస్తుంటారు. కానీ నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా దగ్గరికి వచ్చి, నాకు హిట్ ఇచ్చిన వ్యక్తి త్రివిక్రమ్ శ్రీనివాస్. నేను ఫ్లాప్ లు ఇస్తున్న సమయంలో కూడా ఆయన నాతో జల్సా సినిమా చేసి హిట్ ఇచ్చారు. ఆ సినిమాకు ముందు నాకు త్రివిక్రమ్ గురించి తెలియదు. నేను రీమేక్ లు చేయడానికి బలమైన కారణం ఉంది. నా నిర్మాత బాగుండాలి... సినిమా ఫ్లాప్ అయితే అందరం ఇబ్బంది పడతాం... అంతేతప్ప నేను కొత్త సినిమాలు చేయలేక కాదు. ఇక హరిహర వీరమల్లు చిత్రంలో ఒక యాక్షన్ సీక్వెన్స్ కు దర్శకత్వం వహించాను. మీరు కోరుకుంటున్నట్టే నేను కూడా సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా... ఈ చిత్రం ఎన్ని కోట్లు వసూలు చేస్తుందో చెప్పలేను... ఈ సినిమా మీకు నచ్చితే బాక్సాఫీసును బద్దలు కొట్టేయండి" అని పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

**స్టోరీ లైన్ చెప్పిన పవన్**

"ఏపీలోని కొల్లూరులో కోహినూర్ డైమండ్ దొరికింది. అది అనేక చేతులు మారి బ్రిటన్ మ్యూజియంలోకి చేరింది. దర్శకుడు క్రిష్ చెప్పిన ఈ సినిమా లైన్ నాకు బాగా నచ్చింది. చరిత్ర చూస్తే భారతదేశం ఎవరిపైనా దాడి చేయలేదు... మనపైనే అందరూ దాడి చేశారు. మొఘల్ చక్రవరి ఔరంగజేబు అకృత్యాల గురించి ఎవరూ చెప్పలేదు. హిందువుగా బతకాలంటే కూడా పన్ను కట్టాల్సిన రోజుల్లో ఛత్రపతి శివాజీ వీరోచితంగా పోరాడారు. ఆ తరహాలోనే ధర్మం కోసం పోరాడిన వ్యక్తి కథే హరిహర వీరమల్లు..." అని పవన్ వివరించారు. దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ, "పవన్ గారి కలలోని వీరమల్లు మా ఊహకు అందనంత శక్తివంతమైన పాత్ర. ఈ చిత్రం కోసం రోజూ అంకితభావంతో పనిచేశాం" అని చెప్పారు. నటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ, "పవన్ గారితో నటించడం నా కెరీర్‌లో పెద్ద అవకాశం. ఈ చిత్రం మీ అందరినీ ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నా" అని అన్నారు.
ఈ చిత్రం మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏ.ఎం. రత్నం, ఎ. దయాకర్ రావు నిర్మించారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

# అన్ని మండల కేంద్రాల్లో రేషన్‌కార్డుల పంపిణీ

జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని... ఉదయం ఏడు గంటలకే ఇంటి నుంచి కదలి, పనిలో నిమగ్నం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు ఎక్కడికి వెళ్లారో, ఏం చేశారో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం కార్యాలయ అధికారులు రోజువారీ నివేదికలు సమర్పించాలని సూచించారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఎరువులకు కొరత లేదని, ప్రతి దుకాణం ముందు నిల్వల బోర్డులు ఏర్పాటు చేయించాలని పేర్కొన్నారు. యూరియాను దారిమళ్లిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంటలకు నీటి కొరత రానీయవద్దని, సీజనల్ వ్యాధులను నివారించాలన్నారు. వాతావరణశాఖ అందించే సూచనల ప్రకారం హైదరాబాద్ మహానగరంలో వర్షాలు పడే ప్రాంతాలకు మూడు గంటల ముందే పోలీస్ కమిషనర్లు చేరుకుని, ట్రాఫిక్ సమస్యలను నివారించాలన్నారు. సోమవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాల్లోని అన్ని విభాగాల అధికారులను సమాయత్తం చేయాలి. రాజధానిలో వర్షం వస్తే రహదారులపై నీరు నిలిచిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ప్రమాదాలూ జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు అన్ని విభాగాలు మరింత సమర్థంగా పనిచేయాలి. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా జీహెచ్‌ఎంసీతోపాటు పోలీస్, ట్రాఫిక్ విభాగాలు, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపకశాఖ, హైడ్రా ఆధ్వర్యంలోని 150 బృందాలు
వెంటనే రంగంలోకి దిగాలి. వాననీటిని, చెత్తను తొలగించడంతోపాటు కరెంటు పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణను సమన్వయంతో చేపట్టాలి. భారీ వర్షాలపై మూడు గంటల ముందే సమాచారం వస్తున్నందువల్ల హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు ముందుగానే ఆయా ప్రాంతాల సిబ్బందిని అప్రమత్తం చేయాలి. జిల్లాల్లోనూ వర్షాల సందర్భంగా కలెక్టర్లు, ఎస్పీలు విపత్తు నివారణ చర్యలు చేపట్టాలి. పిడుగులు పడినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పిడుగుపాటుతో ప్రాణనష్టం సంభవిస్తే వెంటనే రెవెన్యూ, పోలీసుశాఖల ద్వారా పంచనామా, ఎఫ్‌ఐఆర్‌లు చేయించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.
భారీ వర్షాలతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి... దోమల బెడదతో డెంగీ, గన్యా, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్, క్లోరినేషన్ చేయాలి. పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కచ్చితంగా విధులకు హాజరయ్యేలా చూడాలి. ఎవరైనా అందుబాటులో లేకపోతే చర్యలు తీసుకోవాలి. పశు వైద్యశాలల సిబ్బంది విధులకు గైర్హాజరు కాకుండా నిఘా ఉంచాలి. ఆసుపత్రులు, పశువైద్యశాలలను కలెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేయాలి. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ అధికారులు ముందుజాగ్రత్తలు తీసుకోవాలి. ఆదివాసీలకు వైద్యసేవలను పరిశీలించాలి. ప్రజలకు ఏ ఆపద వచ్చినా కలెక్టర్లు వెంటనే స్పందించాలి. ప్రతి కలెక్టర్ ఖాతాలో రూ.కోటి అత్యవసర నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుంది.

**నీటి యాజమాన్యంపై దృష్టి...**

భారీ వర్షాల దృష్ట్యా నీటి యాజమాన్యంపై నీటిపారుదలశాఖ దృష్టి సారించాలి. చెరువులు, కుంటలకు, కాల్వలకు గండ్లు పడకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలి. కృష్ణా బేసిన్ పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైంది. త్వరలోనే నాగార్జునసాగర్ నీటిని విడుదల చేస్తాం. గోదావరి బేసిన్‌లో నీరు తక్కువగా ఉంది. ఆగస్టులో నీళ్లొస్తాయి. గతేడాది 2.85 కోట్ల టన్నుల మేరకు వరి పండించి దేశంలో మొదటి స్థానంలో నిలిచాం. ఈసారీ అదే స్థాయిలో పంటలు పండేలా నీరందించాలి.

**యూరియా పంపిణీని పర్యవేక్షించాలి**

రాష్ట్రంలో వచ్చే నెల పదో తేదీ వరకు అవసరమైన ఎరువుల నిల్వలున్నాయి. ఆగస్టు కోటా కూడా త్వరలోనే రాష్ట్రానికి సరఫరా అవుతుంది. కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని చూసి... రైతులు ఎరువుల దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారికి వాస్తవాలు తెలియజేయాలి. కలెక్టర్లు రోజువారీగా ఎరువుల పంపిణీని ఆన్‌లైన్‌లో పర్యవేక్షించాలి. ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో తనిఖీలు చేయాలి. ఎరువుల పంపిణీపై ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్‌ను దుకాణాలు, బస్‌స్టేషన్లలో ప్రదర్శించాలి.

**రేషన్ కార్డుల పంపిణీ**

గతంలో రేషన్‌కార్డులపై ప్రజలకు ఆసక్తి ఉండేది కాదు. సన్న బియ్యం పంపిణీతో డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో 96.95 లక్షల కుటుంబాలకు కార్డులున్నాయి. మరో 7 లక్షల మందికి కొత్త కార్డులు ఇవ్వబోతున్నాం. దీంతో దాదాపు 31 లక్షల మంది అదనంగా లబ్ధి పొందుతారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒకచోట రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి పాల్గొనాలి. ప్రతి మండలంలో కలెక్టర్లతో పాటు అదనపు కలెక్టర్లు పాల్గొనాలి. ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించాలి" అని సీఎం సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి, పొన్నం, వివేక్, వాకిటి శ్రీహరి, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఒక్కోరోజు ఒక్కోచోట అంచనాలకు మించి పడుతోంది. రెండు నెలలపాటు అన్ని విభాగాల అధికారులు జిల్లాల్లో అందుబాటులో ఉండాలి.

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆగస్టు 15 నుంచి అమలు కానుంది. ఈ పథకంలో భాగంగా మహిళలకు 'జీరో ఫేర్ టిక్కెట్' జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.సోమవారం నాడు సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ జీరో ఫేర్ టిక్కెట్లో ప్రయాణికుల ప్రయాణ వివరాలు,
ఉచిత ప్రయాణం వల్ల వారికి ఆదా అయిన మొత్తం, మరియు ప్రభుత్వం 100 శాతం రాయితీని ఇస్తుందనే వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. దీనివల్ల రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులందరికీ తాము ఎంత లబ్ధి పొందారనే విషయం సులభంగా తెలుస్తుందని అన్నారు. ఇందుకోసం అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాల అమలు, వాటి ఆర్థిక భారంపై కూడా అధికారులతో చర్చించారు. ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నుంచి సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

**ఆర్టీసీని లాభాల బాట పట్టించాలి: ముఖ్యమంత్రి**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో ఆర్టీసీకి ఆర్థిక భారం తగ్గించి, సంస్థను లాభాల బాట పట్టించే మార్గాలపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఆదాయ మార్గాలను పెంపొందించడం, నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభసాటిగా మార్చాలని సూచించారు. లాభాల ఆర్జన కోసం ఎలాంటి విధానాలు తీసుకురావాలి అనే దానిపై కార్యాచరణ రూపొందించాలని కోరారు.

**ఇకపై ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు ప్రాధాన్యత**

రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్న బస్సులను కూడా ఎలెక్ట్రికల్ బస్సులుగా మార్పిడి ద్వారా నిర్వహణ వ్యయం తగ్గుతుందని అన్నారు. ఈ బస్సులకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని కూడా సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ఆర్టీసీ స్వయంసమృద్ధి సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మేము జన సమీకరణ చేయలేదు

- **మొదటి పేజి తరువాయి**

ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం రజని మాట్లాడుతూ... జగన్ పర్యటనకు జన సమీకరణ చేశామని కేసులు పెట్టారని తెలిపారు. తాము జన సమీకరణ చేయలేదని... జగన్ పర్యటకు వస్తున్నారని తెలిసి ప్రజలు వారంతట వారే తరలి వస్తున్నారని చెప్పారు. జనం గుండెల్లో జగన్ ఉన్నారని... ప్రత్యేకంగా జన సేకరణ చేయాల్సిన అవసరం లేదని అన్నారు.
జగన్ పర్యటనకు అనేక ఆంక్షలు పెట్టారని రజని అన్నారు. పోలీసుల ద్వారా పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో మోసపోయామని జగన్ కు ప్రజలు చెబుతున్నారని అన్నారు.
ఏడాది కాలంగా వైసీపీ నేతలను, కార్యకర్తలను వేధిస్తున్నారని విమర్శించారు. మిథున్ రెడ్డిపై కూడా తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. జగన్ చుట్టూ ఉన్న వారందరినీ అరెస్ట్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

## జగన్ దురాగతాలను లోక్ సభలో బట్టబయలు చేస్తాం

- **మొదటి పేజి తరువాయి**

ఏపీ లిక్కర్ స్కామ్ విచారణను సిట్ వేగవంతం చేసింది. మరోవైపు ఈ స్కామ్ పై లోక్ సభలో చర్చిస్తామని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు తెలిపారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడు తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హ యాంలో జగన్ చేసిన దురాగతాలను బట్టబయలు చేస్తామని చెప్పారు. లిక్కర్ స్కామ్ లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని సిట్ విచారిస్తోందని తెలిపారు. పార్లమెంట్ లో రైతు సమస్యలు, పంట గిట్టుబాటు ధరలపై కూడా చర్చిస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు.

## నాకు హోమం జరిపించండి... ఏ ఆటంకం రాకుండా చూసుకుంటా

- **మొదటి పేజి తరువాయి**

నన్ను కోరిన వారికి కొంగు బంగారం ఇస్తా. నచ్చిన విధంగా పూజలు జరిపించుకుంటా. భక్తులు కోరినంత వరకు ఇస్తా.. నా అక్కాచెల్లెళ్ల జోలికి వస్తే ఉగ్రరూపం దాలుస్తా. వ్యాపారాలు బాగుంటాయి. ఐదు వారాలు పప్పు బెల్లం ఫలహారాలతో ప్రసాదం పెట్టాలి కోరిన కోరికలు తీరుస్తా అని చెప్పారు మాతంగి స్వర్ణలత.

**మహమ్మారి వెంటాడ్తది**

ఇటీవల జరిగిన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల కార్యక్రమంలో కూడా భవిష్య వాణి వినిపించారు మాతంగా స్వర్ణలత. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని.. కానీ, రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని చెప్పారు. అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్..

- **మొదటి పేజి తరువాయి**

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రీతిలో తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాలను చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం ఈ రాజీనామా తక్షణమే అమలులోకి వస్తుంది.ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడానికి మరియు వైద్య సలహాను పాటించడానికి తాను తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా లేఖలో వెల్లడించారు. స్థిరమైన మద్దతు మరియు సహకారం అందించారంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మంత్రివర్గ సభ్యులకు వారి అమూల్యమైన సహకారం మరియు మద్దతు పట్ల ధన్‌ఖడ్ ధన్యవాదాలు తెలిపారు. తన పదవీ కాలంలో చాలా నేర్చుకున్నానని, పార్లమెంటు సభ్యుల నుంచి తనకు లభించిన ఆప్యాయత, నమ్మకం మరియు ప్రేమను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని ఆయన అన్నారు. తన పదవీ కాలంలో భారతదేశ ఆర్థిక పురోగతి, అభివృద్ధిని చూసినందుకు ధన్‌ఖడ్ గర్వంగా ఉన్నట్లు పేర్కొన్నారు. "భారత్ ప్రపంచ ఖ్యాతి, అద్భుతమైన విజయాలతో నేను గర్వపడుతున్నాను. దేశం ఉజ్వల భవిష్యత్తుపై నాకు గట్టి నమ్మకం ఉంది" అని ఆయన తన వీడ్కోలు సందేశంలో తెలిపారు. జగదీప్ ధన్‌ఖడ్ 2022 ఆగస్టు 11 నుంచి భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు అందుకున్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా సేవలు అందించారు. అంతకుముందు, ఆయన 2019 నుంచి 2022 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా కూడా పనిచేశారు. తన రాజీనామాకు ముందు, ఆయన పార్లమెంటు వర్షాకాల సమావేశాలను రాజ్యసభ ఛైర్మన్‌గా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఆయన రాజకీయ పక్షాలను కోరారు.

## జీవో 49పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందించింది. 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలును నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.జీవో 49 ద్వారా కొమురంభీమ్ ఆసిఫాబాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది!

## బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో విచారణకు రండి

- **మొదటి పేజి తరువాయి**

ఆయా యాప్‌లపై కేసులు నమోదయ్యాయి. వీటన్నింటినీ కలిపి విచారించే ఉద్దేశంతో ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ అంశంపై సిట్ విచారణ జరుపుతుండగా... మరోవైపు ఇదే కేసులో నిధుల మళ్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం గమనార్హం.

## దళితబంధు నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- **మొదటి పేజి తరువాయి**

ఉన్న రూ.4.63 కోట్ల దళితబంధు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. దళితబంధు నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నిధులతో ఏర్పాటు చేసిన యూనిట్లను విక్రయించడంతోపాటు ఇతరులు కొనుగోలు చేయడమూ నేరమేనని చెప్పారు. భారీ వర్షంలో సైతం భట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో స్థానికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యం, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన పేర్ని నాని!

:వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఈనెల 8న పామర్రులో చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. రప్పా రప్పా అని చెప్పడం కాదు... రాత్రికి రాత్రి చేసేయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆయన వ్యాఖ్యానించారని ఆరోపిస్తూ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. తనను అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయనే ఆలోచనతో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన విన్నపాన్ని తోసిపుచ్చిన హైకోర్టు తదుపరి విచారణను రేపటికి (జులై 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో పేర్ని నాని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. పేర్ని నాని కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. రేపటి హైకోర్టు విచారణ అనంతరం ఆయన వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### మిథున్ రెడ్డి మాస్టర్ మైండ్ అయితే...

## ప్రధాన లబ్ధిదారుడు జగనే

:ఏపీ లిక్కర్ స్కాంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టయిన నేపథ్యంలో టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు స్పందించారు. ఈ లిక్కర్ స్కాంలో జగన్ రూ.3,500 కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఈ స్కాంలో మిథున్ రెడ్డి మాస్టర్ మైండ్ అయితే... జగన్ ప్రధాన లబ్దిదారుడు అని యనమల స్పష్టం చేశారు. లిక్కర్ స్కాంలో దోచుకున్న సొమ్మును రాబట్టేందుకు రికవరీ చట్టాన్ని అమలు చేయాలని, లేదా మరో చట్టం తీసుకురావాలని అన్నారు. లిక్కర్ స్కాం కేసును కక్షపూరిత కేసు అని వైసీపీ నేతలు అంటున్నారని, నేరం నుంచి తప్పించుకునేందుకు వారు అలా అంటున్నారని విమర్శించారు. కుంభకోణా లకు పాల్పడిన వారిని ప్రజాకోర్టులోకి తీసుకురావాలని అన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ వాహనంపై దాడిని ఖండించిన తెలంగాణ బీసీ మహాసభ



సి కే న్యూస్ షాద్ నగర్:జులై 21:వ్యక్తి భావ ప్రకటనకు స్వేచ్ఛ కల్పిస్తూ సమాజంలోని మంచి చెడులను అందరికీ వివరించాలనే గొప్ప సత్సంకల్పంతో ఆవిర్భవించినదే జర్నలిజం. కత్తి కన్నా కలం గొప్పదని చెప్పడానికి ప్రత్యక్ష నిదర్శనం ఈ జర్నలిజం సమాజాన్ని ప్రక్షాళన చేయాలన్నా రాజకీయాన్ని స్పటిక సాదృశ్యంగా సమాజం ముందు నిలపాలన్నా ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకొని వెళ్ళాలన్నా ప్రజల బాధలని ప్రభుత్వాలకు చేరవేయాలన్నా మనకు ముందుగా గుర్తుకు వచ్చేది. పత్రికలు పాత్రికేయులు.

వీరు అన్ని వర్గాల వారికి వారధిలా పని చేస్తూ ప్రజల మధ్య గొప్ప సంఘీభావాన్ని సామరస్యతను సృష్టించడంలో ముందుంటారు. నిష్పక్షపాత ధోరణితో వ్యవర్తించే జర్నలిస్టులపై అక్కసు పెంచుకున్న కొందరు ఈ మధ్య తమ సంకుచిత భావాన్ని ప్రదర్శిస్తూ దాడులు జరుపుతున్న సంఘటనలు మనం చూస్తూనే ఉన్నాం.ఈ నేపథ్యంలో షాద్ నగర్ పట్టణ సీనియర్ జర్నలిస్ట్ ఖాజా పాష వాహనంపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి అందరూ పడుకున్న సమయంలో దాడి చేసి కారు అద్దాలు పగలగొట్టడం అత్యంత హేయమైన చర్యగా భావించవచ్చు. ఇది పిరికిపందచర్యగా అభివర్ణించవచ్చు సమాజ హితం కోరి తమ మేధస్సును పణంగా పెట్టి ఎందరికో మార్గదర్శకంగా నిలిచిన జర్నలిస్టులపై అనుచితంగా ప్రవర్తించడం సభ్య సమాజం తలదించుకునే పరిస్థితికి మూల కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని బిసి మహాసభ డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్ కుమార్ , కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కే కృష్ణాజి ,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యాసెట్ శ్రీనివాస్, రంగరెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షులు ఏవీఎం శ్రీధర్ వర్మ , రంగారెడ్డి జిల్లా యువత విభాగం ఉపాధ్యక్షులు మంగ అశోక్ తదితరులు సీనియర్ జర్నలిస్ట్ ఖాజాపాషను పరామర్శించి సంఘీభావం తెలపడం జరిగింది.

# వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- ఎస్సై కూచిపూడి జగదీశ్



తిరుమలాయపాలెం, సి కె న్యూస్, జులై 21.కురుస్తున్న వర్షాలపట్ల తిరుమలాయపాలెం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోమవారం ఎస్సై కూచిపుడి జగదీశ్ అన్నారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు.

కావున మండలంలోని లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే వారితోపాటు,చెరువులు, కుంటలకు సమీపంలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జగదీశ్ కోరారు.ఈ సమయంలో ఎవరుకుడా చేపలకు వేటకు వెళ్లకూడదని,ఇనుప విద్యుత్ స్తంభాలు తాకరాదని,గృహం విద్యుత్ వినియోగంలో జాగ్రత్తల అవసరమని సూచించారు.

ఎక్కడైనా వాగులు, కాలువలు పొంగి పొర్లిన,ఏవైనా ప్రమాదాలు సంభవించిన వెంటనే సెల్: 87126 59136-8712659137 నెంబర్ల ద్వారా సమాచారం తెలపాలని కోరారు.

# మొక్కలు నాటండి భవిష్యత్తును నిర్మించండి

- జమాతే ఇస్లామిక్ హింద్ విజ్ఞప్తి
- పది లక్షల మొక్కలు నాటేందుకు సి ఐ ఓ లక్ష్యం
- విలేకరుల సమావేశంలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్




సి కె న్యూస్ ప్రతినిధి:చేతులు మట్టిలో దేశభక్తి హృదయాంలో అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా మిషన్ ప్లాంటేషన్ లో భాగంగా జమాతే ఇస్లామిక్ హింద్, చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 10 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు జమాతే ఇస్లామిక్ హింద్( సి ఐ ఓ) అధ్యక్షురాలు ఆస్మా అంజుమ్, సెంట్రల్ అధ్యక్షురాలు ఆస్వియా అంజుమ్ లు తెలిపారు.

ఖమ్మం ప్రెస్ క్లబ్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మొక్కలు నాటాలనే సంకల్పంతో ఒక మంచి సామాజిక కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే లక్షలాది మొక్కలు నాటడం జరిగిందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి భవిష్యత్తును నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ చిన్నారులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని తమ వంతు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక యజ్ఞల చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఐఓ నాయకురాలు పాయిజ, నజియా, హుస్సేన్ బి, పర్జన, సుల్తానా, ఫాతిమా, సరిహ, అబ్దుల్, అక్ష, అజ్మన్, సమీరా, గౌస్య, ఇక్బాల్, అసిఫా, లిజ, ముస్ఫర, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు "బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్- 2024" పై ప్రసంగం



సి కె న్యూస్ ప్రతినిధి:ఓడరేవులు,జల మార్గాలు,నౌకానిర్మాణం శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రవేశపెట్టిన "బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్ - 2024"దేశానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తూ తమ పార్టీ మద్దతు తెలుపుతున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున సోమవారం ప్రవేశపెట్టిన "బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్ -2024"పై ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, మా తెలంగాణ తీరరహిత రాష్ట్రమైనా కూడా వాణిజ్యం లో మాత్రం బాగా ముందున్నదన్నారు. ఐటీ, ఫార్మా, టెక్స్ టైల్స్ తదితర రంగాలలో ఎన్నో దేశాలకు తెలంగాణ ఎగుమతులు చేస్తోందని తెలిపారు.అటువంటిది, ఈ బిల్లులో ఉన్న సవరణలు తెలంగాణకూ, దేశానికీ ఎంతో ఉపయోగపడతాయని భావిస్తున్నామని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఈ బిల్లులోని ముఖ్యాంశాలు

క్లాజ్ 2 ప్రకారం "బిల్ ఆఫ్ లేడింగ్"లో పేరుండే వ్యక్తికి అన్ని హక్కులు, బాధ్యతలు వస్తాయని, వాణిజ్యం సూటిగా, నేరుగా జరుగనున్నదని పేర్కొన్నారు. క్లాజ్ 4 ద్వారా నిజమైన డాక్యుమెంట్స్ ఉన్నవారికి న్యాయపరంగా రక్షణ లభిస్తుందని,మోసాలను అడ్డుకునేందుకు ఇది దోహదపడుతుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

క్లాజ్ 5 కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శకాలు ఇవ్వాలనే అధికారం ఇస్తుందన్నారు. 1856 నాటి పాత చట్టాన్ని రద్దు చేసి, కొత్త అవసరాలకు తగ్గట్టుగా ఇది రూపొందించబడిందన్నారు. మన దేశం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.2 బిలియన్ టన్నుల సరుకులు మన ఓడరేవుల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయడం జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇది మన దేశ వాణిజ్య రంగంలో ఒక గొప్ప మైలురాయిగా చెప్పుకోవచ్చన్నారు.

తెలంగాణ 2023-24ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేసిందని,

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర నగరాలలో నెలకొన్న మధ్య, చిన్న తరహా పరిశ్రమలలో ఉత్పత్తైన సరుకులు విదేశీ మార్కెట్‌లకు చేరేందుకు సముద్ర మార్గాన్ని ఉపయోగిస్తున్నట్లు ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఈ బిల్లుతో ఫార్మా కంపెనీలు మాత్రమే కాదు, చిన్న పరిశ్రమలకు, డాక్యుమెంట్ల క్లారిటీ, హక్కుల స్పష్టత వల్ల ఎంతో ఉపయోగం జరుగుతుందని తెలిపారు.

విశాఖపట్నం, చెన్నై పోర్టుల ద్వారా తెలంగాణ నుంచి సరుకులు త్వరగా వెళ్లేలా ఇది మరింత దోహదం చేస్తుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఇందులో ఒకటి రెండు ఆందోళనలు కూడా ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఈ-బిల్ (ఎలక్ట్రానిక్ బిల్స్ ఆఫ్ లేడింగ్) ఎక్కువగా వాడుతున్నారని, హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉన్నందున ఈ బిల్లులో ఈ-బిల్ కు ప్రాధాన్యత ఉండాలని ఎంపీ వద్దిరాజు సూచించారు. చిన్న ఎగుమతిదారులు ఎదురయ్యే వ్యాజ్యాలకు గాను అంతగా ఖర్చు పెట్టే పరిస్థితి ఉండదన్నారు.క్లాజ్ 4 కింద అవకతవకలు, అక్రమాలు నిరూపించాల్సిన భారాన్ని షిప్ మాస్టర్ మీద వేయడం సమస్యలకు దారి తీయవచ్చని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.

ఈ బిల్లుపై మధ్య, చిన్న తరహా పరిశ్రమల వారికి అంతగా అవగాహనే లేదని, తెలియని చట్టం వాళ్లకు ఉపయోగం కాకపోవచ్చని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.

తెలంగాణ ఎగుమతిదారులు ఎక్కువగా అమెరికా, యూరోపియన్ యూనియన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలకు సరుకులు ఎగుమతి చేసేప్పుడు నాన్-నెగోషియబుల్ సీ వేబిల్స్ వాడుతారని, వాటిని ఈ బిల్లులో గుర్తించలేదని ఎంపీ వద్దిరాజు వివరించారు.

ఈ-బిల్ లకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వాలని,హైదరాబాద్ ఐటీ పార్కుల ప్రతిభను దీనికి వాడుకోవచ్చని ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వానికి సలహానిచ్చారు.

ఏపీటీసీసీఐ లాంటి సంస్థల ద్వారా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, చిన్న ఎగుమతిదారుల కోసం ప్రత్యేకంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయాలని,కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరగనవసరం లేకుండా చర్యలు తీసుకోవలసిందిగా ఎంపీ రవిచంద్ర సూచించారు. సీ వేబిల్స్ ను కూడా గుర్తించాలని, ఇది చాలా మంది చిన్న వ్యాపారులకు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

హైదరాబాద్ డ్రైపోర్ట్, రీజనల్ రింగ్ రోడ్ వంటి వాటిని ఈ బిల్లుతో అనుసంధానించాలని, అప్పుడు నిజంగా మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.

ఈ బిల్లు ద్వారా మన దేశ వాణిజ్య విధానాలు ప్రపంచ ప్రమాణాలకు దగ్గరగా వెళ్తున్నాయని,

తెలంగాణ వంటి ఎగుమతుల ఆధారిత రాష్ట్రానికి ఇది పెద్ద ఊపిరిలా ఉంటుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు ఈ బిల్లు మరింత బలాన్నిస్తుందని,ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు. ట్రేడ్ డాక్యుమెంట్లపై నమ్మకం పెరుగుతున్నందున

ఈ బిల్లుకు తమ పార్టీ హృదయపూర్వకంగా మద్దతు ఇస్తున్నదని, తెలంగాణ అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఇది ఒక గొప్ప అడుగు అవుతుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

# ఓయమీర్ పెళ్లి కబురు...!

- కోయ భాషలో పెళ్లి పత్రిక.
- ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జూలై 21, కోయ భాషలో పెళ్లి పత్రిక వచ్చేసింది. ఇప్పటివరకు తెలుగులో శుభలేఖలు వేసుకున్న ఆదివాసీలు ఇక తమ వాడుక భాష అక్షర రూపం దాల్చడంతో నూతన సరళికి శ్రీకారం చుట్టారు. ఆదివాసీ వాడుక భాషను లిపి రూపంలో తీసుకొచ్చే ప్రయత్నం చేసిన భద్రాచలం ఐ.టి.డి.ఎ సఫలీకృతమైందని చెప్పొచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

పాల్వంచ గ్రామానికి చెందిన కన్న రాజు అనే ఆదివాసి యువకుడికి భద్రాచలం జగదీష్ కాలనీకి చెందిన పూనే లక్ష్మీ శరణ్యతో ఆగస్టు 3న వివాహం ముహూర్తం ఖరారు చేశారు.ఈ క్రమంలో వీరి వివాహ వేడుక సంబంధించి కళ్యాణ ఆహ్వాన పత్రికను పూర్తిగా కోయ భాషలో ముద్రించారు. ఈ కళ్యాణ ఆహ్వాన పత్రిక చూడముచ్చటగా ఉంది.పందీర్ ముహూర్తం, పెళ్లి మూర్తం, మా సొంత నార్,కబూర్, కరంగానూర్ ఇయాల్ అంటూ...కోయ భాషలో శుభ ఘడియలు,వేదిక,విందు, ఆహ్వానించువారు ఈ పదాలను పొందుపరిచి భళా..ఆదివాసీ శుభ కళ్యాణ పత్రిక అనేలా రూపొందించారు. కళ్యాణ పత్రిక పై భాగాన భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్ ప్రేరణతో 'కోయ భాషలో పెళ్లి శుభలేఖ అంటూ ముద్రించి పి.ఓ పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. సోమవారం ఈ ఆహ్వాన పత్రికను భద్రాచలం ఐటీడీఏ పీవో ఛాంబర్ లో పిఓ రాహుల్ ఐఏఎస్ ఆవిష్కరించారు. కోయ భాష దినోత్సవం రోజునే కోయ భాషలో ఉన్న ఈ ఆహ్వాన పెళ్లి పత్రికను ఆవిష్కరించడం గమనార్హం.

ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ... కోయ భాషలో ఉన్న పెళ్లి పత్రికను చూడటం ఆనందకరంగా ఉందన్నారు. గిరిజనుల మాతృభాషలో లిపి అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ఇందుకోసం భద్రాచలం ఐటిడిఏ ఎంతగానో చర్యలు తీసుకుందన్నారు. అంతరించిపోతున్న ఆదివాసి గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు భవిష్యత్తు తరాలకు అందించే ప్రయత్నంలో భాగంగానే భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీల సంస్కృతిపై ప్రత్యేక అధ్యయనం చేసి ఆదివాసి తెగల ఇలవేల్పుల చరిత్రను సేకరిస్తున్నామన్నారు. నేటితరం గిరిజన బాలబాలికలకు, యువతి యువకులకు వారి భాష పై మక్కువ కలిగేలా ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న స్వాతంత్ర దినోత్సవ వేడుక, గణతంత్ర దినోత్సవం వేడుక, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా అందించే ఆహ్వాన పత్రికలు, ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలు కోయ భాషలోనే ముద్రించి పంపిణీ చేయడం జరిగిందని పిఓ వెల్లడించారు

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు మరియు గిరిజన మహిళలు, పురుషులు తదితరులు పాల్గొన్నారు.

# ఆషాడ మాసం సందర్భంగా ఘనంగా గోరింటాకు వేడుకలు



సి కె న్యూస్ ప్రతినిధి తెలంగాణ

గాండ్ల మహిళా సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు ఆషాడమాస శుభ సందర్భంగా ఈరోజు ఖమ్మం టిఎన్జిఓ ఫంక్షన్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ ఆషాడ మాసం పుణ్య సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఖమ్మం జిల్లాలో ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఉత్సాహపూరితంగా ఆనందభరితంగా జరిగాయి. ఈపర్వతదినాన్ని మహిళల సభ్యులు పాల్గొనడం ద్వారా మరింత విశిష్టంగా జరుపుకున్నారు. సంస్కృతి పరిమళాల మధ్య జరిగిన ఈ వేడుకలు విజయవంతంగా జరిగినవి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక మహిళలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. గాండ్ల మహిళా సంఘం అధ్యక్షురాలు వేల్పుల మాలతి కార్యదర్శి పొతు రాజశ్రీ కోశాధికారి గుజ్జే%శీ%టి శైలజ కార్యవర్గ సభ్యులు జక్కం సుజాత, గుద్దేటి సునీత,భుదాటి రేణుక, బెక్కంటి ప్రవీణ, పోతు రాధ, గుజ్జెటి సునీత, వరికుంట సంపూర్ణ, బెక్కంటి లావణ్య, వేల్పుల రమ్య, హెచ్ పద్మ మరియు ఈ కార్యక్రమంలో సుమారు వందమందికి పైగా మహిళలు పాల్గొన్నారు పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినారు.

# సమిష్టి నిర్ణయంతో వ్యక్తిగత బాధ్యతలను నిర్వర్తించండి : కూనంనేని

- పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు
- బాధ్యతలు స్వీకరించిన దండి, జమ్ముల

సి కె న్యూస్ ప్రతినిధి: భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి సమిష్టి నిర్ణయాలు, వ్యక్తిగత బాధ్యతలు నిర్వర్తిస్తూ బలోపేతం కావాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. నూతన నాయకత్వం సమర్థవంతంగా పనిచేయాలని నూతన ప్రాంతాలకు పార్టీ విస్తరించే -దిశగా కార్యక్రమాలను తీసుకోవాలని ఆయన కోరారు. సిపిఐ 23వ జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన దండి సురేష్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన జమ్ముల జితేందర్రెడ్డి సోమవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని ఇద్దరిని శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు హాజరై నూతన నాయకత్వాన్ని -అభినందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీకి ఒక చారిత్రిక నేపథ్యం ఉందని అనేక పోరాటాలతో వినతికెక్కిందన్నారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు క్యాడర్ను సిద్ధం చేయాలన్నారు. పార్టీ శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డిసెంబర్ 26న ఐదు లక్షల మందితో బహిరంగ సభ జరగనుందని ఇందుకు సంబంధించి త్వరలోనే ఆహ్వాన సంఘాన్ని -ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు -యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పలువురుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



సి కె న్యూస్ ప్రతినిధి:నారాయణఖేడ్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త నగేష్, కంజీపూర్ తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ ఓంకార్ తండ్రి , మరియు కొండాపూర్ మిట్య నాయక్ తండాకు చెందిన గోవింద అమ్మగారు పలువురు ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని చెప్పిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ సర్పంచ్ ఏక్ నాథ్ రావు, మాజీ ఎంపీటీసీ ముజామిల్,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్ కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ, లక్ష్మణ్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాములు, ప్రేమ్ సింగ్, చింటూ నరేష్, రాజు, విట్టల్, మారుతి, బసప్ప, ధర్మానాయక్, మాణిక్, మోహన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ జలాలు వెంటనే విడుదల చేయాలి

- రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి
- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు




**సి కె న్యూస్ ప్రతినిధి, ఖమ్మం :** సాగర్ ఆయకట్టు లో వరి నాట్లు పూర్తి చేయుటకు సాగర్ జలాలు విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం లో పోతినేని మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు రైతులు సాగర్ జలాలు వస్తాయనే ఆశతో వర్షలకు వరి నారుమళ్లు పోసి నాట్లు వేయటం కు సిద్ధం అవుతున్నారన్నారు.
సకాలంలో సాగర్ జలాలు విడుదల చేసి వానాకాలం వరి పంట సాగర్ ఆయకట్టు లో పండించేందుకు జిల్లా మంత్రులు మరియు జిల్లా కలెక్టర్ ఇతర ఇరిగేషన్ అధికారులు తక్షణమే చోరవ చూపాలన్నారు. పంటల సీజన్ ప్రారంభం అయినందున జిల్లాలో యూరియా కొరత లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సొసైటీలలో యూరియా నిల్వలేకపోతే రైతులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు సిండి కేట్‌గా మారి కృత్రిమ యూరియా కొరతను సృష్టిస్తారు. దీని వల్ల సరైన సమయంలో పంటలకు యూరియా వేయలేని పక్షంలో పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రభుత్వం ఈ అంశాలనీతిని పరిగణలోకి తీసుకొని సకాలంలో అవసరమైన మేరకు రైతులకు యూరియా అందుబాటు లో ఉండేలా చూడాలన్నారు. అధికారులకు వస్తే అర్హులైన పేదలందరికీ ఇండ్లను ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆ హామీ అమలులోకి వచ్చేసరికి గ్రామాల్లో కొద్దిమంది కి మాత్రమే ఇండ్లను కేటాయించి వందలాది మది లబ్ధిదారులను వదిలేసిందన్నారు. అవి కూడా రాజకీయ జోక్యంతో అధికార పార్టీక చెందిన నేతలు వారి యొక్క అనుచర వర్గాలకు ఇండ్లను కేటాయింపు చేసుకుంటున్నారని వారన్నారు. ఇండ్ల కేటాయింపులు రాజకీయ జోక్యం సరికాదన్నారు. ఖమ్మం జిల్లాలో అర్హత కలిగిన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అనేక సంక్షేమ పథకాలను ప్రకటించిందని ఆచరణలో చూస్తే వాటి అమలులో అలసత్వం వహిస్తుందని అన్నారు. తక్షణమే కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీటిని అమలుకు పూనుకోవాలని అన్నారు. ఆగస్టు 12 నుండి సెప్టెంబర్ 12 వరకు పార్టీ మాజీ కేంద్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామ గ్రామాన నిర్వహించాలన్నారు.
ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్,కళ్యాణ వెంకటేశ్వరరావు, వై విక్రమ్, బండి పద్మ బొంతు రాంబాబు, మాదినేని రమేష్,
యర్రా శ్రీనివాసరావు తో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు హాజరైనారు.

## నియోజకవర్గ నికి ఎన్ని నిధులు తెస్తున్నారో మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పాలి

**మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి**



**సి కె న్యూస్ ప్రతినిధి:**మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సిర్గాపూర్ మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో మంజూరు చేయించి నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహ వస్తున్నారని ఆయన రావడమే కాదు నియోజకవర్గానికి ఆ మండల కేంద్రానికి ఎన్ని నిధులు తెస్తున్నారు సమాధానం చెప్పాలని తెలిపారు..
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మాధవరావు పటేల్,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ బుజ్జి, మండల పార్టీ అధ్యక్షులు విఠల్ రావు పటేల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్,కురుమ సంఘం తాలూకా అధ్యక్షులు ప్రభాకర్ కురుమ, ఉపాధ్యక్షులు మల్గొండ, మాజీ ఎంపీటీసీ ముజామిల్, మాజీ సర్పంచ్ విజయ్,నాయకులు యాదవరావు పాటిల్, లక్ష్మణ్ నాయక్,సంతోష్ కురుమ,చింటూ నరేష్, ప్రశాంత్ సాగర్, నర్సాగౌడ్, రమేష్, విఠల్,రాములు తదితరులు పాల్గొన్నారు పార్టీ కోసం కష్టపడ్డవారిని అధిష్టానం ఎప్పుడు మర్చిపోదు.

## టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములును సన్మానించిన పాల్వంచ నాయకులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 21,**టీపీసీసీ జనరల్ సెక్రటరీగా నాగా సీతారాములు నియామకం ద్వారా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డవారిని అధిష్టానం ఎన్నడు మర్చిపోదని మరోసారి రుజువు చేసినట్టు అయిందని పాల్వంచ కాంగ్రెస్ నాయకులు అన్నారు. పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు ఆధ్వర్యంలో నాగా సీతారాములును పాల్వంచ కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా నూకల రంగారావు మాట్లాడుతు పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి కీలక బాధ్యతలు అప్పగించడం హర్షించతగ్గ విషయమని, 30 సంవత్సరాలనుండి పార్టీ అభివృద్ధి కోసం చేస్తున్న నాగా సీతారాములు కు పదవీ రావడం ఆనందంగా ఉందని తెలిపారు. కష్టపడే వారికి పదవులు రావడం ఎంతో సంతోషకరమని చెప్పారు. అన్ని వేళల కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో అండగా ఉండే నాగా సీతారాములు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు.
ఈ కార్యక్రమములో పాల్వంచ పట్టణ కాంగ్రెస్ నాయకులు, ఐ ఎన్ టి యు సి నాయకులు, అనుబంధ సంఘ నాయకులు,మహిళా సంఘ నాయకులు,యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇది నాయకుల ఎన్నిక కాదు... కార్యకర్తల ఎన్నిక!



- ప్రతి గ్రామాన్ని బీజేపీ కోటగా మార్చండి
- రుణమాఫీ మాయ, పల్లె ప్రగతి గాలిమాట
- ఇంటింటికీ మోదీ అభివృద్ధి సందేశం తీసుకెళ్లండి
- కార్యకర్తలే పార్టీ విజయానికి పునాది కావాలి
- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**సి కె న్యూస్ ప్రతినిధి:**రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి బీజేపీ కార్యకర్త ఒక ఛాలెంజ్‌గా తీసుకొని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలో బీజేపీ నిర్వహించిన ప్రత్యేక కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఇది నాయకుల ఎన్నిక కాదు... కార్యకర్తల ఎన్నిక!” అని ... గ్రామ అభివృద్ధికి నిధులు వచ్చేది మన ప్రభుత్వాల నుంచే అని స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో ప్రతీ స్థానంలో బీజేపీ పోటీచేయాలని, ప్రతి ఓటు జాతీయ అభివృద్ధికి పునాదిగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లండి**

గత రెండేళ్లుగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామీణ పాలన పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. “నరేంద్ర మోడీ ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయకపోతే గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది,” అని గుర్తు చేశారు.
ప్రతి గ్రామానికి వెళ్లి, ఇంటింటికీ చేరి మోదీ ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. బలమైన కార్యాచరణ ద్వారానే బీజేపీ స్థానిక ఎన్నికల్లో విజయం సాధించగలదని స్పష్టం చేశారు. ఈసారి ఓటుతో గ్రామాన్ని గెలిపించాలి... దేశాన్ని ముందుకు నడిపించాలి,” అని ఆయన నినాదం ఇచ్చారు.

**“పల్లె ప్రగతి” మాయమాటగా మిగిలింది**

**జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు**

కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ కేవలం మాటల్లోనే మిగిలిపోయిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో లక్షలాది మంది రైతులు ఇప్పటికీ రెండెకరాలకుపైగా రుణ భారం మోస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు వరి బోనస్ విషయంలో ప్రభుత్వం న్యాయం చేయలేదని, ఎండాకాలంలో కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటికీ చెల్లింపులు రాకపోవడం సరికొత్త మోసమని చెప్పారు. విత్తనాల విషయంలోనూ నకిలీ విత్తనాలతో వ్యవసాయం దెబ్బతింటోందని, అసలు విత్తనాలు దొరకని పరిస్థితిని తీవ్రంగా విమర్శించారు.
“వాణిజ్య వర్గాల పక్షపాతం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యుత్ కొరతలు, సాగునీటి సమస్యలు గ్రామీణ ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో మూడుమంది మంత్రులు ఉన్నా కూడా పరిస్థితి యథాతథంగా ఉండడం ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రతిబింబిస్తోంది,” అని ఆయన వ్యాఖ్యానించారు.
ఇందిరమ్మ ఇల్లు, యువశక్తి కార్డులు, రేషన్ పథకాలు వంటి సంక్షేమ పథకాలను కూడా కేవలం రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ద్వారా ప్రభుత్వం దారితప్పిన పాలన సాగిస్తున్నదని ఆరోపించారు. నిజమైన అర్హులను పట్టించుకోకుండా అనర్హులకు లబ్ధులు చేకూర్చుతున్నారని విమర్శించారు.

**“క్షేత్రస్థాయిలో పని చేయండి – గెలుపే లక్ష్యం”**

నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ – “ఇప్పటికైనా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి. ఇంటింటికీ చేరాలి. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, మోసాలను ప్రజలకు వివరించాలి. బీజేపీని ఒక్కొక్క స్థానంలో గెలిపించే దిశగా కృషి చేయాలి,” అని పిలుపునిచ్చారు. ఈ కార్యశాలలో జిల్లా కన్వీనర్ ఇవి రమేష్,రాష్ట్ర నాయకులు గెంటాల విద్యాసాగర్ రావు, దొంగలు సత్యనారాయణ, సన్నీ ఉదయ్ ప్రతాప్,దేవికి వాసుదేవరావు,దిద్దుకూరి వెంకటేశ్వరావు,నున్నా రవి, నంబూరి రామలింగేశ్వరరావు, పుల్లారావు యాదవ్, సుదర్శన్ మిశ్రా, నలగట్టు ప్రవీణ్, నెల్లూరి బెనర్జీ, రాజేష్ గుప్తా, వేల్పుల సుధాకర్,వీరవెల్లి రాజేష్ విజయ రెడ్డి, నకరీకంటే వీరభద్రం, పమ్మి అనిత, టి. రవీంద్రనాథ్, రుద్రగాని మాధవ్, కొమిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ చెస్ దినోత్సవ వేడుకలు





**సి కే న్యూస్ షాద్ నగర్:జులై 21:**ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆదివారం షాద్‌నగర్ చెస్ అకాడమీ ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. చెస్ మాస్టర్ జగన్ ఆధ్వర్యంలో చిన్నారులతో పాటు పలువురు చదరంగం క్రీడాకారులు పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు.
ఈ సందర్భంగా చిన్నారులకు చదరంగం పోటీలు నిర్వహించగా,వివిధ వయస్సు వర్గాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో మెరుగైన ప్రదర్శన చేసిన విజేతలకు చెస్ మాస్టర్ జగన్ గోల్డ్ మెడల్స్ అందజేశారు. విజేతలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిచాయి. చదరంగం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ మాస్టర్ జగన్ మాట్లాడుతూ...చదరంగం కేవలం ఆట కాదు,అది మానసికాభివృద్ధికి దోహదపడే విద్య. ఈ ఆట ద్వారా పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సమస్యల పరిష్కార సామర్థ్యం పెరుగుతాయి. చదరంగంలో ప్రావీణ్యం సాధించడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. చదరంగం క్రీడను ప్రతి చిన్నారికి పరిచయం చేసి, ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారుల తల్లిదండ్రులు, చెస్ అకాడమీ సభ్యులు, స్థానిక ప్రతినిధులు సంఘీభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో చదరంగం పట్ల ఉన్న ఆసక్తిని చూసి అందరూ హర్షం వ్యక్తం చేశారు. షాద్ నగర్ చెస్ అకాడమీ తరఫున ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి : పువ్వాడ

- పువ్వాడను కలిసిన సిపిఐ నూతన నాయకత్వం



**సి కె న్యూస్ ప్రతినిధి:**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఐ
సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు సూచించారు. ప్రజా సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవడం ద్వారా పార్టీ బలపడుతుందని ఆయన తెలిపారు. పార్టీ 23వ మహాసభలో కార్యదర్శిగా ఎన్నికైన దండి సురేష్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన –జమ్ముల జితేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నేతృత్వంలో సోమవారం పువ్వాడను తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పువ్వాడ మహాసభలు జరిగిన తీరు, చర్చలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. తనను కలిసిన నూతన నాయకత్వంతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పార్టీ పునర్ వైభవానికి కృషి చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు అనుకూల పవనాలు ఉన్నాయని కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని పువ్వాడ తెలిపారు. పాలక వర్గాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో –పోరాట కార్యాచరణ రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, పుచ్చకాయల కమలాకర్, మేకల శ్రీనివాసరావు, రవీంద్రబాబు, యానాలి సాంబశివరెడ్డి, కౌన్సిల్ సభ్యులు నూనె శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## సుదీని రుక్కమ్మ మృతి బాధాకరం

- బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**సి కె న్యూస్ ప్రతినిధి:**డిండి మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు సుదీని కృష్ణా రెడ్డి తల్లీ సుదీని రుక్కమ్మ మృతి చాలా బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం సుదీని రుక్కమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని రుక్కమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతుని ప్రార్ధించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ డిండి మండల అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వర రావు, పిఏసిఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు,మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ,బోడ్డుపల్లి జయంత్,లోకసాని శ్రీనివాస్ రెడ్డి,దుబాయ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- విద్యార్థులను పరామర్శించిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి



**సి కె న్యూస్ ప్రతినిధి:**నాగల్ గిద్ద మండల పరిధిలోని మొర్గి గ్రామంలోని మాడల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి ఫుడ్ పాయిజన్ కు గల కారణాలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి
అనంతరం మాజీ ఎమ్మెల్యే విద్యార్థులతో మరియు పాఠశాల యొక్క ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ కు గల కారణాలు ఏంటని వారిని అడిగి తెలుసుకున్నారు
ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుండి నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలుచోట్ల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ మరియు వైరల్ ఫీవర్ వచ్చిన పట్టించుకునే పాపాన పోలేరు అని విమర్శించారు.
అలాగే ఆసుపత్రిలోని చికిత్స పొందుతున్న విద్యార్థులకు ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యొక్క వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.
ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆసుపత్రి సూపర్ రిండెంట్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ బుజ్జి,మండల పార్టీ అధ్యక్షులు విఠల్ రావు పటేల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నాగేష్ సెట్, కురుమ సంఘం తాలూకా అధ్యక్షులు ప్రభాకర్ కురుమ, ఉపాధ్యక్షులు మాల్గొండ, మాజీ ఎంపీటీసీ ముజామిల్, శ్రీధర్ పటేల్, లక్ష్మణ్ నాయక్, చింటూ నరేష్, సంతోష్ కురుమ, రాములు,ఆసుపత్రి వైద్యులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి కల్లా మార్కెట్ యార్డ్ ను అందుబాటులోకి తేవాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- మార్కెట్ యార్డ్ ఆధునీకీకరణ పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసిన మంత్రి తుమ్మల



సి కె న్యూస్ ప్రతినిధి:డిసెంబర్ లోగా మార్కెట్ యార్డ్ ఆధునీకీకరణ పనులు పూర్తిచేసి, సంక్రాంతి కల్లా అందుబాటులోకి తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రివర్యులు స్థానిక గ్రెయిన్ మార్కెట్ ఆధునీకీకరణ పనులను సోమవారం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఊరి బయట ఉన్న మార్కెట్, ఊరి మధ్యలోకి వచ్చిందని, రఘునాథ పాలెం మండలంలో 100 ఎకరాల్లో నిర్మించాలని తలచానని తెలిపారు. 20 డివిజన్ల ప్రజలు మిర్చి ఘాటు తో ఇబ్బంది పడేవారని,అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సీఎం ను ఒప్పించి గతంలో అనుమతి పొందానన్నారు. మద్దులపల్లి మార్కెట్ ను కూడ అందుబాటులోకి తెచ్చానని తెలిపారు. ఈ మార్కెట్ ను అంతర్జాతీయ స్థాయిలో మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దాలని మంత్రి అన్నారు. మన మార్కెట్ ను దేశంలోని అన్ని మార్కెట్లు దిక్సూచి గా తీసుకోవాలన్నారు.

రైతులకు ఎలాంటి నష్టం జరగొద్దని, అవన్నీ దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశానని తెలిపారు. ఎగిలిటి కంపెనీ నమ్మకమైన కంపెనీ అని, డిసెంబర్ చివరి వరకు గడువు ఇచ్చినట్లు, ఆలోగా పనులన్నీ పూర్తి అవ్వాలన్నారు. సంక్రాంతి పండుగ రోజు రైతులు పంట ఉత్పత్తులు తెచ్చి వ్యాపారం చేసుకునేలా ప్లాన్ చేస్తున్నామన్నారు.

ఇతర రాష్ట్రాలు, దేశాల వారీగా వచ్చే వ్యాపారులు ఎగుమతి, దిగుమతి కూడా ఇక్కడే జరిగేట్లు చర్యలు చేపడుతున్నామన్నారు. పనులపై అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలన్నారు. రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దని తెలిపారు. పండించిన పంటకు భద్రత కల్పించాలన్నారు.

5 నెలల గడువులోగా మోడల్ మార్కెట్ ను అందివ్వాలని మంత్రి తెలిపారు. మార్కెట్ కు వచ్చే భారీ వాహనాల వల్ల రోడ్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అందుకుగాను ప్రజల గుడిసెలు తొలగించి, వారికి పునరావాసం కల్పించేందుకు స్థలం చూసి ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ వెంకటేశ్వర రావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ట్రయిల్ రన్ ఈనెల 24 న నిర్వహించాలి - మంత్రి తుమ్మల

- నేషనల్ హైవే ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు మార్పు చేయాలి
- వెలుగుమట్ల అర్బన్ పార్కు లో సాగునీటి పైప్ లైన్ వేయాలి
- ఖమ్మం నగరంలో రహదారుల విస్తరణ చేపట్టాలి
- ఇళ్ళు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి




సి కె న్యూస్ ప్రతినిధి: రఘునాధపాలెం మండలంలోని చెరువులన్నింటిని ఈనెల 24వ తేదీ న ట్రయల్ రన్ వేసి చెరువులు నీటితో నింపే లా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న పనులన్నీటిని సత్వరమే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సబ్ స్టేషన్ నిర్మాణం కోసం యన్.పి.డి.సి.యల్

సిఎండి వరుణ్ రెడ్డి తో మాట్లాడి తక్షణమే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ అడ్వైజర్ శ్రీ పెంటా రెడ్డి గారితో మాట్లాడి ఈనెల 24వ తారీఖున ట్రయిల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పై కోడుమూరు గ్రామం వద్ద ఉన్న హై టెన్షన్ లైన్ ను తక్షణమే మార్చేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో డైరెక్టర్ లతా వినోదకు సూచించారు. నేషనల్ హైవే మరియు ట్రాన్స్కో అధికారులు సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా వెలుగుమట్ల అర్బన్ పార్క్ లో వన్యప్రాణులకు త్రాగు నీరు మరియు నర్సరీ మొక్కలకు నీటిని అందించేందుకు కొదమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్క్ వరకు పైప్ లైన్లు వేసేలా చర్యలు తీసుకోవాలని. ఆ డిజైన్లను డీఎఫ్ఓ తో సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు.

ఖమ్మం నగర సుందరీకరణ కోసం రహదారులను విస్తరించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చుట్టూ రహదారుల విస్తరణను వ్యక్తిగతంగా పరిశీలించి ఎవరినైనా గృహాలు కోల్పోతే వారికి డబల్ బెడ్రూం ఇల్లులు కానీ ఇందిరమ్మ ఇల్లు కానీ కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు అదేవిధంగా మాస్టర్ ప్లాన్ ను సత్వరమే ఆమోదం పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరినారు.

# రేషన్ కార్డు అంటే ఆహార భద్రత

- 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం దేశంలోనే ఒక రికార్డు
- అభివృద్ధి, సంక్షేమం జోడెట్ల మాదిరిగా పరుగులు పెట్టిస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



సి కె న్యూస్ ప్రతినిధి:రేషన్ కార్డు అంటేనే ఆహార భద్రత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం మధిర నియోజకవర్గం బోనకల్లు మండల కేంద్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు.

అత్యంత పేదలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతి వర్గాలకు కూడా ఇందిరమ్మ ప్రభుత్వంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాదు, సన్న బియ్యం కూడా ప్రజా ప్రభుత్వంలో పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వడం భారతదేశ చరిత్రలో నే ఒక రికార్డు అని అన్నారు. లబ్ధిదారుల సంఖ్య రీత్యా చూసినా, సన్న బియ్యం వారీగా చూసిన ఈ దేశంలో ఆహార భద్రత విషయంలో తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా నిలిచిందని తెలిపారు.

కొత్తగా పెళ్లి అయిన వాళ్ళు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు పేరు నమోదు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం గత పది సంవత్సరాలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఫలితం కనిపించలేదని తెలిపారు. ఒక మధిర నియోజకవర్గంలోనే కొత్తగా 13,767 మంది లబ్ధిదారులకు ఒకేరోజు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సంతోషించదగిన అంశం అన్నారు. రేషన్ కార్డులో జారీ అనేది ఉమ్మడి రాష్ట్రంలో నిరంతర ప్రక్రియ కాగా ప్రతి సంవత్సరాలు పరిపాలించిన వారు ఈ విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా ఈ పథకం కింద రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు అందుబాటులోకి వచ్చిందని వివరించారు.

ఇటీవలే తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతులకు రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో జమ చేశాం అని అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద 21 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు చెల్లించామని వివరించారు.

కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాదు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడేట్ల మాదిరిగా పరుగులు పెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ ద్వారా 20వేల కోట్లతో పనులు చేపట్టామని, విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు.

## ర్యాకల చిన్న బాలయ్య మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్



సి కే న్యూస్ షాద్ నగర్:జులై 21:ఫరూఖ్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ర్యాకల చిన్న బాలయ్య చనిపోవడం పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ అన్నారు. చిన్న బాలయ్య మరణవార్తను తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి, పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ ఒక నిబద్ధత గల కార్యకర్తలను కోల్పోయిందని విచారణ వ్యక్తం చేశారు. బాలయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. వారి వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, వీరేశం గుప్తా, గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఏరియా పర్సనల్ డిపార్ట్ మెంట్ సమీక్ష సమావేశం.

డిజిఎం (పర్సనల్) ఎస్. రమేష్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 21,జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరం నందు సోమవారం డీజీఎం పర్సనల్ ఎస్. రమేష్ అధ్యక్షతన ఏరియా పర్సనల్ డిపార్ట్ మెంట్ లకు సంబందించిన సంక్షేమ అధికారులు, పి.ఓ. ఏ లు మరియు ఆయా డిపార్ట్ మెంట్ మినిస్టియల్ స్టాఫ్ తో సమీక్షా సమావేశం నిర్వహించబడినది.

ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ ఎస్. రమేష్ ముందుగా 2020, 2021,2022, 2023 మరియు 2024 సం ఎం లలో గైర్ హాజరు అయిన కార్మికుల చార్జిషీట్ ఎంక్వైరీ ప్రక్రియ సమీక్షించారు. అనంతరం ఇతర కారణాల వల్ల దార్జిషీట్ పొందిన ఉద్యోగుల ఎంక్వైరీ స్టేటస్ ను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ... సంక్షేమ విభాగం విధులు ఎంతో బాధ్యతాయుతమైనవి. ముఖ్యంగా. 31.12.2024 వరకు పికేఓసి, కేపియూజి, ఎంఎన్ జిఓసిపి, కేసిహెచ్పి, ఏరియా వర్క్ షాప్ మరియు ఏరియా హాస్పిటల్ మరియు ఇతర విభాగాలకు సంబందించిన కారుణ్య నియామకాల మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి సకాలంలో క్లెయిమ్స్ పూర్తి చేయాలని సూచించారు.

ఉద్యోగుల పదవి విరమణ బెనెఫిట్స్, సి.ఎం.పి.ఎఫ్. పెన్షన్, గ్రాట్యుటీ, అదే విధంగా హేచ్.బి.ఏల్. ఐ.ఆర్.ఎస్ / సిపిఆర్ఎంఎస్ క్లైమ్స్ కొరకు సంబంధిత ఉద్యోగుల నుంచి తగిన డాక్యుమెంట్స్ తీసుకొని వాటిని సకాలములో క్లియర్ చేయాలి.

కోర్ట్ కేసుల పురోగతి వివరాలు వెబ్సైట్ లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు.

సింగరేణి ఉద్యోగుల మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల కార్పొరేట్ సాలరీ అకౌంట్ ఓపెనింగ్ వివరాలు ఎప్పటికప్పు అడిగి తెలుసుకోవాలన్నారు.

ప్రతి నెల 5వ తేదీ లోపు గైర్హాజరు ఉద్యోగులకు ఉద్యోగం విలువ తెలిసి వచ్చేల కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పించాలి.

క్వార్టర్స్ నియామకం, పీనల్ రెంట్, హెచ్ఎస్ఏ, క్వార్టర్స్ ఎప్పటికప్పుడు డీజిటలైజేషన్ చేయాలని సూచనలిస్తూ అర్హత గల పెన్షన్ హెూల్డర్స్ యొక్క రీవైజిడ్ పిపిఓ ఇష్యూ చేయడానికి సంబంధిత పత్రాల సేకరణ వివరాలను తెలుసుకున్నారు.

క్యాడర్ స్కీమ్ ప్రోమోషన్స్ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.

సిఎంపిఎఫ్ పోర్టల్ మరియు ఉద్యోగ పర్సనల్ వివరములతో కూడిన ఎంప్లాయిా పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పోర్టల్ వినియోగించుటకు ఉద్యోగులలో అవగాహన పెంపొందించాలని సూచించారు.

మాజీ ఉద్యోగులు సిపిఆర్ఎంఎస్ మరియు పెన్షన్ రినివల్ కొరకు మీసేవ సెంటర్ లో రినివల్ చేసుకోవాలని తెలియజేశారు.

విఐపి/ వివిఐపి ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబందిత వెబ్ సైట్ లో వెంటనే అప్ లోడ్ చేయాలని సూచించారు.

పర్సనల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్, సీనియర్ పర్సనల్ అధికారులు సంక్షేమ అధికారులు, మినిస్టియల్ సిబ్బంది మరింత నిబద్ధతతో పని చేస్తూ పారదర్శకంగా తమ వంతు సేవలు అందించాలి అని తెలియజేశారు.

ఈ సమావేశంలో... డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్, సీనియర్ పీఓలు సింగు శ్రీనివాస్, వి రామేశ్వర రావు , డి. నరేశ్ , మేనేజ్మెంట్ ట్రైనీ ( పర్సనల్) సాయి శ్వేత, ఎస్ చంద్రకిరణ్, వంశీ కృష్ణ , సాయి మౌనిక మరియు డిప్యూటీ సూపరింటెండెంట్ మధు , అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం. నరసింహ రావు, ఓసి-4 పిఏ ఎండి షాబుద్దీన్ , కేసిహెచ్పి పిఏ ఎండి సుభాని, అన్నీ విభాగాల మినిస్టియల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) గా బి.వెంకన్న బాధ్యతల స్వీకరణ.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జులై 21,సింగరేణి కాలరీస్ లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) గా శ్రీ బి.వెంకన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2010 భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్టీఎస్)కు చెందిన ఆయనను మూడేళ్ల పాటు సింగరేణికి డిప్యూటేషన్పై పంపించే ప్రతిపాదనకు క్యాబినెట్ అపాయింట్మెంట్స్ కమిటీ ఇటీవలే ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయన సింగరేణి భవన్ లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సంస్థ చైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ను కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో ప్రతీ ఏటా సుమారు 700 లక్షల బొగ్గు రవాణా జరుగుతూ ఉంటుందని దీనిలో అధిక భాగం రైలు మార్గం ద్వారా పలు రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా అవుతుందని, ఈ నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా కంపెనీ లక్ష్యాలను సాధిస్తూ సంస్థ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. సింగరేణి సంస్థలో పనిచేయటం ఒక అదృష్టంగా భావిస్తున్నానని, నిర్దిష్ట లక్ష్యాల మేరకు బొగ్గు రవాణా జరపడంలో శక్తి మేర కృషి చేస్తానని బి.వెంకన్న తెలియజేశారు.

## బోనం ఎత్తిన ఎమ్మెల్యే

రుద్రాక్షపల్లి గ్రామం లో ఘనంగా బోనాలు జాతర



సి కె న్యూస్ ప్రతినిధి:

సత్తుపల్లి నియోజకవర్గయి సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామం లో జరిగిన బోనాలు ఉత్సవాల్లో సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మహిళలతో కలిసి బోనం ఎత్తి మొక్కులు చెల్లించుకున్నారు

ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మండలం, రుద్రాక్షపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, మండల మరియు గ్రామ నాయకులు,కార్యకర్తలు, మహిళలు ప్రజలు పాల్గొనగలరు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక
మంగళవారం | తెలంగాణ
22 జులై 2025
cknews@gmail.com


## కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల అమలు కోసం నిరంతరం శ్రమిస్తున్న గాంధీ-

- నెహ్రూ కుటుంబాల విధేయుడు ఖర్గే.
- రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),**
కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల అమలు కోసం నిరంతరం శ్రమిస్తూ గాంధీ-నెహ్రూ కుటుంబానికి విధేయుడుగా ఉంటున్న మహోన్నతవ్యక్తి ఖర్గే అని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.
అఖిల భారత కాంగ్రెస్ ( ఏఐసీసీ) అధ్యక్షులు, మాజీ కేంద్ర మంత్రి మల్లిఖార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
సోమవారం పాల్వంచ అయ్యప్ప నగర్ లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో బర్త్ డే కేక్ ను కొత్వాల తోపాటు కాంగ్రెస్ నాయకులు కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు.
ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ తొమ్మిదిసార్లు కర్ణాటక శాసనసభ్యునిగా, కేంద్ర కార్మిక, రైల్వే మంత్రిగా, లోక్ సభలో పార్లమెంటరీ పార్టీ నాయకునిగా, అనేక పదవులను చేపట్టారన్నారు. ఖర్గే నాయకత్వంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయం అని కొత్వాల అన్నారు.
ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కాల్వ భాస్కరరావు, ఎస్ వీ ఆర్ కే ఆచార్యులు, కాపర్తి వెంకటాచారి, వై వెంకటేశ్వర్లు, కందుకూరి రాము, షేక్ చాంద్ పాషా, డిష్ నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్ రావు, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, కాపా శ్రీనివాసరావు, జూనియర్ గద్దర్ బాషా, మస్నా శ్రీనివాసరావు, కటుకూరి శేఖర్, కొత్తపల్లి రవి, సమ్మిడి జనార్ధనరెడ్డి, జగన్నాధం అజిత్‌లి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 21,**దుమ్మగూడెం మండలం, కోయ నర్సాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు
పల్లెలు అభివృద్ధి కోరకు రాష్ట్ర ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించినందుకు నియోజకవర్గ ప్రజల తరుపున అభినందనలు తెలిపిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి తెలిస్తే వెంటనే సమాచారం అందించండి.

ఇల్లందు డిఎస్పీ చంద్రభాను.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 21,**ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని 21 పిట్ ఏరియా తిలక్ నగర్,విజయలక్ష్మి నగర్లో ఇల్లందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రభాను ఆధ్వర్యంలో సోమవారం ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని 21 పిట్ ఏరియా తిలక్ నగర్ మరియు విజయలక్ష్మి నగర్ లలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఇందులో భాగంగా కాలానీలలోని ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ఇట్టి సోదాలలో సరిగ్గా పత్రాలు లేని 15 ఆటోలు,52 బైకులను సీజ్ చేసి జరిమానాను విధించడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి వంటి ప్రభుత్వ నిషేధిత పదార్థాలను కనుగొనడానికి నార్కోటిక్ డాగ్స్ ద్వారా సోదాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం అక్కడి స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇల్లందు డిఎస్పి చంద్రభాను పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.రాబోయే ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ సూచనలు మేరకు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.ఇట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. కాలనీవాసులందరూ కలిసి తమ తమ ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాలు నియంత్రణ కు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 80 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు అన్ని మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ..... సీఎం రేవంత్ రెడ్డి

- భారీ వర్షాల వల్ల ఏ ప్రమాదం జరగకుండా చూడాలి
- పిడుగుపాటు వల్ల మానవ, పశువు ప్రాణ నష్టం కల్గకుండా చర్యలు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు
- ఎరువుల డీలర్ల దగ్గర ఉన్న స్టాక్ వివరాలు నోటీస్ బోర్డు పై నమోదు చేయాలి
- నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
- వానాకాలం పంట సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు
- వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎం



**సి కె న్యూస్ ప్రతినిధి:**
జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సీతక్క శ్రీధర్ బాబు , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు తో కలిసి హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లతో కలిసి బోనకల్ రైతు వేదిక నుండి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ కలెక్టర్ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్ లు దృష్టి సారించాలని అన్నారు.
జూలై 21 వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులు గా వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో పిడుగు పాటుకు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాలు వచ్చినప్పుడు చెట్ల కింద స్తంభాల దగ్గర ఉండకుండా చూడాలని అన్నారు. పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీనికోసం పోలీసు అధికారులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని అన్నారు.
వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. నీటి నిల్వ లు లేకుండా చూడాలని, ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే అక్కడ ఆయిల్ బాల్స్ వంటివి స్థానిక సంస్థల ద్వారా వేయాలని అన్నారు. డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు.
జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర సమయంలో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు.
భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మన ప్రాజెక్టులలో నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం మన రాష్ట్రంలో దేశంలోనే అత్యధికంగా రెండు కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి చేశామని అన్నారు. గోదావరి బేసిన్ లో ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉందని, ఇక్కడ నీరు వృధాగా పోకుండా ప్రాజెక్టులలో ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు.
వ్యవసాయ శాఖ అధికారులు ,నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల, ఎరువులు, అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు.
ప్రతి జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యులర్ గా ప్రకటనలు విడుదల చేయాలని, ప్రతి ఎరువుల షాప్ వద్ద స్టాక్ వివరాలు నోటీసు బోర్డులు పెట్టాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులను నియంత్రణకు పెట్టాలని అన్నారు. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పి కొట్టాలని సీఎం పేర్కోన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని అన్నారు.
20 నుంచి 25 శాతం ఎరువులు వ్యవసాయ అవసరాల కోసం కాకుండా ఇతర అంశాలకు, డీజిల్ వాహనాలలో పొగ తగ్గించేందుకు సబ్సిడీ ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారని సీఎం అన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సబ్సిడీ ఎరువులు దారి మళ్ళించకుండా చూడాలని అన్నారు.
వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అంశాలకు యూరియా వినియోగిస్తే కఠినంగా వ్యవహరించాలని క్రిమినల్ కేసుల నమోదు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎరువుల అంశంలో ఫిర్యాదులను నమోదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ జిల్లాలలో ప్రచారం చేయాలని అన్నారు.
రాష్ట్రంలో నూతనంగా దాదాపు 7 లక్షల రేషన్ కార్డులను ,31 లక్షల లబ్ధిదారులతో మంజూరు చేసామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 96 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉపయోగిస్తున్నారని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఉన్నప్పుడు ప్రజలు ఎక్కువ పట్టించుకోలేదని బ్లాక్ మార్కెట్లో పోయేదని, ప్రస్తుతం సన్న బియ్యం సరఫరా చేయడంతో చాలా డిమాండ్ వచ్చిందని, ప్రజలు తప్పనిసరిగా రేషన్ తీసుకుంటున్నారని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.
జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, వీటిలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు పాల్గొనేలా చూడాలని సీఎం తెలిపారు.
ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక చోట ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఒక చోట పాల్గోనేలా కలెక్టర్ కోఆర్డినేట్ చేసుకోవాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డిఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ కిందిస్థాయి సిబ్బంది అధికారులు ప్రజలను కలెక్టర్ అప్రమత్తం చేయాలని అన్నారు.
వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, ప్రకృతి కరుణించిందని, ఈ సీజన్ లోను మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు.
రైతులకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, రైతు భరోసా అందించామని తెలిపారు. ఈ సీజన్లోనూ ప్రకృతి మన రాష్ట్రంపై కరుణ చూపించిందని, గత సీజన్ మాదిరిగానే పెద్ద ఎత్తున ఆహార ఉత్పత్తులు సాధించి దేశంలోనే తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తుందని అన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాగానే రైతు భరోసా నిధులు జమ చేశాం, సీజన్ ప్రారంభంలో వర్షాలు కాస్త నెమ్మదించిన ప్రస్తుతం విస్తృతంగా వర్షపాతం నమోదవుతుందని, రైతులు పంటలపరంగా ఇబ్బంది లేదని డిప్యూటీ సీఎం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల యూరియా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం మూలంగా క్రమంగా ఆ సమస్య కూడా పరిష్కారం అవుతుందని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్లు జిల్లాల్లో జాగ్రత్తగా సమన్వయం చేసుకుంటే యూరియా సమస్యను అధిగమించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు.
బ్యాంకులు కూడా సకాలంలో రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తున్నాయి, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు మండలాల వారిగా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు సీఎం తెలిపారు.
10 సంవత్సరాలుగా పంపిణీకి నోచుకోని రేషన్ కార్డులు ప్రస్తుతం పెద్ద సంఖ్యలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుండడంతో సర్వత్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందుతున్నాయని తెలిపారు.
వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున కలెక్టర్లు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సందర్శించి, హెచ్ఓడి లకు టార్గెట్లు ఫిక్స్ చేస్తే సీజనల్ వ్యాధులను అధిగమిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.
నాగార్జునసాగర్ కు వరద నీరు చేరుతుంది, నాగార్జునసాగర్ కు పైన ఉన్న ప్రాజెక్టులన్ని నిండుగా ఉన్నాయని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఎప్పుడు కూడా జూలై చివర్లోనే నీటి ప్రవాహాలు కనిపిస్తాయి అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ ఆకాంక్షల మేరకు అధికారులు దృష్టి పెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు సాధిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.
రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రం నుండి సరైన సహకారం లేదని, కావాల్సిన యూరియా సరఫరా కాలేదని అన్నారు. ఇప్పటికే 50 శాతం నాట్లు పడ్డాయని, వచ్చే నెలలో యూరియా కేంద్రం నుండి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెఫెడ్ నుండి డీలర్లకు, డీలర్ల నుండి రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. యూరియా వ్యవసాయానికి మాత్రమే వాడకుండా ఇతర అవసరాలకు వాడకుండా పోలీస్, రెవెన్యూ, టాన్స్‌పోర్టర్స్ అప్రమత్తం అవ్వాలని మంత్రి అన్నారు.
ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కురిసే వర్షాలను ప్రాజెక్టులలో నీటి నిల్వలు పెంచుకునేందుకు వ్యూహం ప్రకారం వ్యవహరించాలని అన్నారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్స్ సీటు కేటాయించాలి....

- సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి...
- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేసిన...
- యస్. షాబీర్ భాష ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.
- ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షుడు విష్ణు.

**సీ కే న్యూస్ ఎమ్మిగనూరు, జూలై 21,**ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక ప్రభుత్వ బీసీ,ఎస్ సి బాలికల వసతి గృహమునకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు కేటాయించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. షాబీర్ భాష అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. షాబీర్ భాష, ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షుడు విష్ణు లు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ మాచాని సోమప్ప ప్రాథమికోన్నత పాఠశాల, కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరం విద్యనభ్యసిస్తున్నటువంటి విద్యార్థులు బీసీ హాస్టల్ కు 280 మంది విద్యార్థినీలు,ఎస్సీ హాస్టల్ కు 80 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొని నెల రోజులు కావస్తున్న సంక్షేమ హాస్టల్లో వసతి కోసం నిరీక్షిస్తూ, సుదూర ప్రాంతాల నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి విద్యార్థులు స్కూల్ కు, కళాశాల కు రావడానికి ఇబ్బంది పడుతూ ఇంటి దగ్గరే ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు, హాస్టల్ వసతి లేకపోతే విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు, తక్షణమే జిల్లా కలెక్టర్, బీసీ వెల్ఫేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ అధికారులు చొరవ తీసుకోని ఎమ్మిగనూరు పట్టణం నందు ప్రవేట్ బిల్డింగ్ తీసుకొని అయిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని, అదేవిధంగా బీసీ ఎస్సీ హాస్టల్స్ కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు



# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది.





## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 21,** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఖమ్మం జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేకానంద, దామోదర రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వర్షాకాలం అయినందున జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో నీటి నిల్వలు స్థాయి- వినియోగం, వానాకాలం సీజన్ లో వ్యవసాయ సాగు, యూరియా నిల్వలు, ఎరువులు కొరత లేకుండా సమకూర్చడం, ప్రతి ఫర్టిలైజర్ షాపును తనిఖీలు చేపట్టి ఆయా షాపులలో ఉన్న నిల్వలు, నోటీస్ బోర్డులపై ఉంచిన వివరాల పరిశీలన చేసి పక్కదారి పట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జన జీవనానికి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రహదారులు తెగిపోకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని, వాతావరణ సూచనలకు అనుగుణంగా జిల్లాలలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జిల్లాలలో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. గిరిజనులు అంటూ వ్యాధుల బారిన పడకుండా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని, పశువులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు కలెక్టర్ల కార్యచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో నివేదికను అందించాలని తెలిపారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటికి సంబంధించి నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. యూరియా స్టాక్ కు సంబంధించి ప్రతి ఎరువుల షాపు వద్ద స్టాక్ వివరాలు తెలిసేలా బోర్డుపై ప్రదర్శించాలని, ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ఎరువుల కొరత ఉన్నట్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా కావలసినంత అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు సంక్షేమమే అన్నిటికన్నా ముఖ్యమని తెలిపారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదుల కొరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా దాదాపు 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గతంలో చౌక ధరల దుకాణాలపై ప్రజలకు ఆసక్తి ఉండేది కాదని, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ కార్డు, చౌక ధరల దుకాణం విలువ పెరిగిందని, 3 నెలల సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 25 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, శాసన సభ్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని, జిల్లా కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను పరిశీలించి అవసరమైన మేరకు నియామకంతో పాటు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాలలో అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, డెంగ్యూ, మలేరియా ఇతర జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాతావరణ శాఖ సూచన మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజా సంక్షేమం కోసం 3 గంటల ముందుగా బృందాలను పంపించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమ చర్యలకు అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులతో మాట్లాడుతూ%

జిల్లాలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ముప్పు ఉండే ప్రాంతాల్లో ముందస్తుగా అవసరమైనంత మేరకు ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా తక్షణమే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

వర్షాలు పెరగడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున, ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా మెలకాల కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. నీటి నిల్వలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వి దోమల వ్యాప్తి నివారించాలని సూచించారు.

యూరియా వంటి కీలక ఎరువుల సరఫరా విషయంలో రైతులలో ఆందోళన కలగకుండా ఉండేందుకు ప్రతి ఎరువుల దుకాణం ముందు అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను ప్రదర్శించేలా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైతే డిమాండ్‌కు అనుగుణంగా మరింత స్టాక్ కూడా సమకూర్చేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచిచారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ అర్జున్ రావు మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలను విజయవంతం చేయండి...







● రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్

**పెబ్బేరు జూలై21 (సి కే న్యూస్)**టీయూడబ్ల్యూజే (ఐజేయు) తృతీయ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ స్టేట్ సెక్రటరీ గుండ్రాతి మధు గౌడ్ పిలుపునిచ్చారు.సోమవారం పెబ్బేరు ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన జిల్లా మహాసభల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న టీయూడబ్ల్యూజే యూనియన్ పెద్దపీట వేస్తుందని అన్నారు.ప్రతి సమస్యలపై గళమెత్తి రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి జర్నలిస్టులకు కావలసిన విద్య,వైద్యం,అక్రిడిటేషన్ కార్డులు,ఇళ్ల స్థలాలపై మొదటి నుంచి కొట్లాడి ఇప్పించిన ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే అని చెప్పారు.తృతీయ జిల్లా సభలకు ముఖ్య అతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణా రావు,వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి,దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్,ఐజేయు స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవులపల్లి అమర్,యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ,ప్రధాన కార్యదర్శి రామ్నారాయణ,స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి వస్తున్నారని,జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా వారిని కోరనున్నట్లు తెలిపారు. కమిటీలో ఉండేవారే లీడర్లు కాదని, సభకు వచ్చే ఒక్క జర్నలిస్టు లీడరేనని అన్నారు.జిల్లా మహాసభలకు అన్ని మండలాల నుంచి యునియన్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై జర్నలిస్టుల ఐక్యతను చాటుతూ జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఇటీవలే న్యాయవాద పట్టా అందుకున్న సీనియర్ జర్నలిస్టు పౌర్ణా రెడ్డిని పెబ్బేరు ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు వనపర్తి నుంచి వచ్చిన యూనియన్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మాధవరావు,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్,జర్నలిస్టులు ఊషన్న,శ్రీనివాసరావు,రాజు,మణ్యం,నరసింహరాజు,అరుణ్,ఎన్.శ్రీనివాస్,రవికాంత్,విజయ్ కుమార్,బాలరాజు,కిరణ్ కుమార్ గౌడ్,రాజేంద్రప్రసాద్, గోపాలకృష్ణ,ఎ.విజయ్, పరుశరాముడు,కెఎం.భాషా,అతీక్,మణ్నెం,రమేష్,నాగరాములు,రాంబాబు,రామకృష్ణ,రంజిత్,తరుణ్,ప్రకాష్,గోపి,నాగరాజు, మహేష్, శంకర్, మిద్దె రాములు,శ్రీకాంత్,బద్రుద్దీన్, గోవిందు,రాజేష్,ఎం. రాములు,ఎ. రాము, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులు - కొత్త సమస్యలు.

**సీ కే న్యూస్ జూలై ,21.**
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త రేషన్ కార్డులు కోసం అప్లై చేసిన ప్రజలకు ఇప్పుడు కొత్త సమస్యలు ఎదురు అవుతున్నాయి.అందరు సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.
సమస్యలు ఏమిటంటే ..ఇన్కమ్ టాక్స్,ల్యాండ్, ఎలక్ట్రిసిటీ 300 యూనిట్లు యావరేజ్, ఫ్యామిలీ లో ఫోర్ వీలర్ అంటూ సమస్యలు ప్రజలు ఎదురుకుంటున్నారు.చాలా మందికి అర్హత ఉన్న పై సమస్యలు ఉన్నట్టు చూపిస్తుంది.ప్రభుత్వం గ్రీవెన్స్ ఆప్షన్ ఇచ్చిన కూడా కొన్ని సమస్యలు ఇంకా అలానే ఉన్నాయి.ఎక్కువగా ఎలక్ట్రిసిటీ ప్రాబ్లెమ్ ఉన్నాయి అని తెలుస్తుంది. గ్రీవెన్స్ లో ఎలక్ట్రిసిటీ సంబంధించిన ఆప్షన్స్ లో కూడా ఎటువంటి అప్డేషన్ లేదు.చాలా మంది నీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దీనిని పరిష్కరించాలని ప్రజలు అందరూ కోరుకుంటున్నారు.వెంటనే దీన్ని మంత్రి గారి దృష్టి లోకి వెళ్ళాలని తెలియజేస్తున్నారు

# 10 సంవత్సరాల కాలంలో రైతు రుణమాఫీ చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం...

బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలి...



**పెబ్బేరు జూలై21 (సి కే న్యూస్)**10 సంవత్సరాల కాలంలో రైతు రుణమాఫీ చేయని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేడు
బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు.వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వకుండా కాలం గడిపిందని కానీ నేడు ప్రజా ప్రభుత్వం ఒక్క వనపర్తి జిల్లా లోనే 36,323 కుటుంబాలకు రేషన్ కార్డు ఇచ్చి అండగా నిలబడిందని అన్నారు.10 సంవత్సరాల కాలంలో రైతు రుణమాఫీ చేయకుండా కాలం గడుపుతే సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఆదుకోవాలని మేనిఫెస్టో లో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం జిల్లా వ్యాప్తంగా 61,687 రైతులకు 49,11,43,107 కోట్ల రూపాయలను రుణమాఫీ చేశారని అన్నారు.రైతు భరోసా కింద 175869 రైతులకు 205 కోట్లు ఇచ్చి పంటల పెట్టుబడికి సహాయంగా నిలిచామని అన్నారు.పది సంవత్సరాలు అధికారంలో ఉన్న కృష్ణానది , గోదావరి నీళ్ళు వాట కోసం నోరు మెదపని నాయకులు రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిన ప్రకారం 500 రూపాయలకి గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని,గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల కరెంటును ఉచితంగా అందిస్తున్నామని అన్నారు.రాష్ట్రంలో వరి పండించిన రైతు నుంచి ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వమే కొంటూ సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు.రాష్ట్రంలో ప్రతి పల్లెలో ఇందిరమ్మ ఇల్లు ఉండాలని ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నామని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరుని చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వారికి సోలార్ ప్లాంట్లను, పెట్రోల్ బంక్ లను,ఆర్టీసీ బస్సుల ఓనర్లను చేసి వారి అభివృద్ధికి సహకరిస్తుందని అన్నారు.దేశంలోనే మొట్టమొదటిగా కుల గణన చేసిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని అన్నారు.వచ్చే స్థానిక ఎలక్షన్లో 42 శాతం బీసీలకు సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు.బిఆర్ఎస్ నాయకులు విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈనెల 25న న్యూఢిల్లీ తల్క టోరా స్టేడియంలో భాగీ దారీ న్యాయ సమ్మేళనం కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుందని అందులో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వివిధ రాష్ట్రాల ఓబిసి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని,కావున వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్,వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా,వనపర్తి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాములు,వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్,చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్,పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్,వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాబా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్,జానంపేట నాగరాజు,మన్యం సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# మండలం నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.




**దేవనకొండ (సి కే న్యూస్)జూలై 21** మండలంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని బిజెపి మండల అధ్యక్షుడు బొలెద్దుల కిరణ్ ,సీనియర్ నాయకులు జంగం వీరయ్య ఎంపీడీవోని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు పల్లెదొడ్డి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నరకయాతనంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలలో మురుగునీరు చేరుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రహదారిపై నిల్వ ఉన్న నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రంగస్వామి, పల్లెదొడ్డి రాముడు పాల్గొన్నారు.

# పిక్‌టాక్ : నిజమైన అందాల నిధిని చూడండి



సవ్యసాచి, మిస్టర్ మజ్ను సినిమాలతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నిధి అగర్వాల్. పేరుకు తగ్గట్లుగానే అందాల నిధి ఈ అమ్మడు అనిపించే విధంగా చాలా అందంగా ఉంటుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోల కారణంగా ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 30 మిలియన్‌లకు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు ఇండస్ట్రీలో మాత్రం పెద్దగా సినిమాల్లో కనిపించడం లేదు. 2019లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో ఈ అమ్మడు సక్సెస్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత వరుస సినిమాలు వస్తాయని ఆశించినా కూడా అదృష్టం ఈ అమ్మడికి కలిసి రాలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో కెరీర్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. వచ్చే నెలలో ఈ అమ్మడు నటించిన హరి హర వీరమల్లు సినిమా విడుదల కాబోతుంది. పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందిన ఈ సినిమాకు క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఏ ఎం రత్నం ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాపై చాలా అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో నిధి అగర్వాల్ పాత్రకు మంచి స్పందన వస్తుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. అంతే కాకుండా ఈ అమ్మడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాసాబ్ సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ సినిమా కూడా ఇదే ఏడాది చివరి వరకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ ఏడాదిలో ఈ అమ్మడికి అతి పెద్ద రిలీజ్‌లు ఉన్నాయి.

ఈ రెండు సినిమాలతో టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా నిధి అగర్వాల్ మారడం ఖాయం అనే నమ్మకంను పలువురు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. ఆ ఫోటోలు ఈమె స్థాయిని మరింత పెంచుతున్నాయి. తాజాగా అందమైన తన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మరోసారి నిధి అగర్వాల్ వైరల్ అవుతోంది. నిజంగా అందాల నిధి ఈ అమ్మడు అంటూ ప్రతి ఒక్కరూ కితాబిచ్చే విధంగా ఈ అమ్మడి ఫోటోలు ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇంతటి అందాల నిధికి ఎందుకు ఇన్నాళ్లు సరైన బ్రేక్ పడలేదు అంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉంటే, మరికొందరు మాత్రం ఈ ఏడాది ఈమెకు టర్న్ కావడం ఖాయం అంటున్నారు. ఇండస్ట్రీలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోలు, వీడియోలు చర్చనీయాంశం అవుతూ ఉంటాయి. అందాల నిధి అగర్వాల్‌కి ఇకపై గుడ్ టైం షురూ అంటూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. ఎన్నో విధాలుగా అందాల నిధికి స్టార్ హీరోయిన్ అయ్యేందుకు అర్హతలు ఉన్నాయి. కానీ అదృష్టం మాత్రం ఈమెకు కలిసి రాలేదు. అయినా కూడా ఈ అమ్మడు ఇండస్ట్రీలో తన ప్రయత్నాలు చేస్తూ వస్తుంది. ముందు ముందు అయినా ఈ అమ్మడు ఇండస్ట్రీలో ముఖ్యంగా టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి అది సాధ్యమేనా చూడాలి.



## బ్లాక్ డ్రెస్‌లో షామా సికిందర్ టైమ్‌లెస్ త్రోబ్యాక్

# నేచురల్ స్టార్ డబుల్ హ్యాట్రిక్!



మాస్ హిట్ - దసరా- నుంచి నాని సక్సస్ కి తిరుగులేదు. - దసరా- నానికి భారీ మాస్ హిట్ గా నిలిచింది. అప్పటివరకూ క్లాస్ హీరోగా కనిపించిన నాని - దసరా- తో మాస్ లో ఫాలోయింగ్ మొదలైంది. మాస్ పాత్రలకు పర్ఫెక్ట్ గా సూటవుతాడని దసరా ప్రూవ్ చేసింది. అప్పటికే క్లాస్ ఇమేజ్ ఉన్న నానిపై మాస్ కి కనెక్ట్ అవుతాడా? లేదా? అన్న సదేహం ఉండేది కానీ ఆ హిట్ తో అన్ని పటాపంచల్ అయ్యాయి.

అటుపై - హాయ్ నాన్న- తో తనమార్క్ క్లాసిక్ హిట్ అందుకున్నాడు. అనంతరం - సరిపోదా శనివారం- అంటూ క్లాస్ అండ్ మాస్ ఆడియన్స్ ని అలరించాడు. ఇలా నాని కెరీర్ లో మూడు విజయాలు నమోద య్యాయి. ఆ హ్యాట్రిక్ విజయాన్ని కంటున్యూ చేస్తూ - హిట్ -3- తో మరో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. సైకో లను డీల్ చేసే పోలీస్ ఆఫీసర్ పాత్రలో మరోసారి మాస్ కోణంలో పీక్స్ చూపించాడు. ఈ సినిమా బాక్సా ఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించింది.

దీంతో నాని కెరీర్ లో వరుసగా నాలుగు విజయాలు నమోదయ్యాయి. నానికి ఇలాంటి సక్సస్ లు కొత్తేం కాదు. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి వరుస విజయాలు సాధించాడు. కానీ డబుల్ హ్యాట్రిక్ మాత్రం మిస్ అయ్యాడు. మళ్లీ ఇప్పుడా ఛాన్స్ ఉంది. మరో రెండు సినిమాలు హిట్ కొడితే డబుల్ హ్యాట్రిక్ నమోదైనట్లే. అందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం %-%దసరా%-% దర్శకుడితో నే %-%ప్యారడైజ్%-% సినిమా చేస్తున్నాడు. ఈ చిత్రంపై అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. అసలే సక్సస్ ఫుల్ కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి మ్యాజిక్ చేస్తారు? అన్న అంచనాలున్నాయి. ఈ సినిమా అనంతరం నాని లైనప్ లో స్టార్ డైరెక్టర్లే ఉన్నా రు. ఇప్పటికే శేఖర్ కమ్ములా పేరు వినిపిస్తుంది. అలాగే త్రివిక్రమ్, రాజమౌళి కూడా సినిమా చేసే అవకాశా లున్నాయి. వాళ్లే బరిలోకి దిగితే నాని ఖాతాలో డబుల్ హ్యాట్రిక్ లాంఛనమే.



## ఆంచల్ ముంజాల్ గోల్డెన్ బీచ్‌సైడ్ షూట్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వెలుగులు నింపింది